ప్రజాశక్తి
సోమవారం 18 డిసెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం



21న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ జంక్షన్‌లో సాయిబాబా జ్ఞాన మందిరంలో ఈనెల 21న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సమస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల ఉన్న నేత్ర రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జనవరి నుంచి రెండో దఫా ఆరోగ్య సురక్ష

త్వరలో జారీకానున్న ఉత్తర్వులు
20 నుంచి ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్, అవగాహన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2024 జనవరి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 నుంచి ఇంటింటా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈనేపథ్యంలో రూపొందించిన బ్రోచర్‌ను 18వ తేదీన సిఎం జగన్మోహన్‌రెడ్డి దూర దృశ్య కార్యక్రమం ద్వారా ఆవిష్కరించనున్నారు. రెండోవిడత ఆరోగ్య సురక్షకు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నట్టు సమాచారం. ఈ సారి గ్రామ స్థాయిలో కాకుండా మండల కేంద్రాలు, పక్కపక్క గ్రామాలకు అందుబాటులో ఉండే ఊళ్లల్లో పెట్టాలని ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. మండలం యూనిట్‌గా నెలలో నాలుగు శిబిరాలు చొప్పున ఆరు నెలల పాటు నిర్వహించేందుకు ప్రణాళి రూపకల్పన జరుగుతోంది. ఇవి కూడా మంగళ, శుక్రవారాల్లో నిర్వహించాలని భావిస్తున్నట్టు సమాచారం. తొలి దఫా నిర్వహించిన జగనన్న శిబిరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50లక్షల మందికి స్కీనింగ్ పరీక్షలు నిర్వహించి, అంతకు మించిన సంఖ్యలో వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించినట్టుగా అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో తొలి విడత నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 2,53,679 మందికి స్కీనింగ్ టెస్టులు నిర్వహించారు. వీరందరికీ కలిపి 2,90,000 ఆరోగ్య పరీక్షలు చేశారు. మొత్తంగా 8,541 మందిని వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వీరిలో 3,954 మంది కేటరాక్టు, _మిగిలినవారు ఇతర వ్యాధులతోనూ బాధపడుతున్నారు. రిఫర్ చేసిన కేసుల్లో ఇప్పటి వరకు 1185 కేసులు ఆసుపత్రులకు వెళ్లాయి. 173మంది ఆసుపత్రుల్లో జాయిన్ అయ్యారు. వీరిలో 157మందికి సర్జరీలు చేయించుకున్నట్టు సమాచారం. 151 మంది ఇప్పటికే ఇళ్లకు చేరారు. ఆసుపత్రులకు రానుపోను ఛార్జీలు, ఇతర ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించిందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందికి ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేసి ఆసుపత్రి సేవలు, గుండె, ఊపరితిత్తులు, కంటి తదితర సర్జరీలు



ఆరోగ్య శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

చేసినట్టుగా ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. సురక్ష శిబిరాలకు వచ్చినవారిలో ఎక్కువ మందికి బిపి, సుగర్, కంటి చూపు సమస్యలతో ఉన్నట్టుగా వైద్యులు గుర్తించారు.

ఆరోగ్య శ్రీ సమాచారం తెలుసుకోవడంతోపాటు సంబంధిత ఆసుపత్రుల్లోని ఆరోగ్య మిత్రలను ఇంటినుంచే సంప్రదించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను, కరపత్రాన్ని రూపొందించింది. ఆరోగ్య శ్రీ కొత్తకార్డులను కూడా ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని ఈనెల 18న సిఎం జగన్మోహన్‌రెడ్డి లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. అదే రోజు జిల్లా కేంద్రంతోపాటు సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల్లో కూడా దూర దృశ్య కార్యక్రమం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. 20వ తేదీ నుంచి వైద్యారోగ్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ పెట్టించడంతోపాటు ఆపరేటింగ్ గురించి వివరించనున్నారు. తద్వారా వివిధ జబ్బులకు సంబంధించిన నెట్ వర్కు ఆసుపత్రులను గుర్తించడంతోపాటు సంబంధిత ఆసుపత్రుల్లోని ఆరోగ్య మిత్రను నేరుగా ఫోన్‌లో సంప్రదించుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ఖచ్చితమైన సమాచారంతో రోగులు ధైర్యంగా ఆసుపత్రులకు వెళ్లవచ్చని, సమయం ఆదా అవుతుందని అధికారులు చెప్తున్నారు. దీనికితోడు ఆరోగ్య శ్రీ కార్డుదారులు ఆయా ఆసుపత్రుల్లో పొందాల్సిన సదుపాయాలు, హక్కుల గురించి కూడా ఇంటి నుంచే తెలుసు కోవచ్చునేది ప్రభుత్వ భావనగా ఉంది.



రక్తదాతకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న సిఐ చంద్రమౌళి

రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - వీరఘట్టం

రక్తాన్ని దానం చేసి ఒకరికి ప్రాణదాతగా కావాలని పాలకొండ సిఐ చంద్రమౌళి రక్తదాతలకు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కళింగ వైశ్య న్యూ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. మీరిచ్చే రక్తాన్ని ఇతరులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన, గర్భిణీలకు, రక్తహీనత కలిగిన వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా 20మంది యువకులు రక్తం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు, స్థానిక ఎస్సై ఎంవి రమణ, న్యూ హెల్పింగ్ హ్యాండ్ నిర్వాహకులు ఎస్ పద్మరాజు, తదితరులు, పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ఐక్య పోరాటం

- సాధన కమిటీ ఏర్పాటు కావాలి
- 10న కలెక్టరేట్ వద్ద ర్యాలీ, ధర్నా
- సదస్సులో వక్తల పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, న్యాయవాది జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా వెనుక బాటును, వలసలను నివారించి సమగ్రాభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం సాధన కమిటీగా ఏర్పడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు అధ్యక్షతన ఆదివారం బెలగాంలోని చర్చి కమ్యూనిటీ హాలులో జిల్లా సమగ్రాభివృద్ధిపై సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు, సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఒకవైపు ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం, అక్షర జ్ఞానం లేని గ్రామాలు, మరోవైపు అభ్యుదయ భావాలతో దోపిడీని ఎదిరించే గ్రామాలు ఈ జిల్లా ప్రత్యేకతలన్నారు. జిల్లాలో అపారమైన వనరులున్నా జిల్లా పాలకుల నిర్లక్ష్యానికి గురై ఏళ్ల తరబడి వెనుకబడిన ప్రాంతంగా మిగిలిందన్నారు. పాలకులు జిల్లా అభివృద్ధికి కావాల్సిన వాటి కోసం ఆలోచించే పరిస్థితి లేదని, ఇదే జిల్లా వెనుకబాటుకు కారణమని, దీన్ని అధిగమించాలంటే ప్రజలు చైతన్యంతో పోరాటమే మార్గన్నారు.

1978లో ప్రారంభించిన జంఝావతి ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. దశాబ్దాలు నాటి అడారుగెడ్డ, జంపరకోట మినీ ప్రాజెక్టులు సైతం పూర్తి చేయలేదన్నారు. మినీ రిజర్వాయర్లు నిర్మించాల్సిన గిరిజనుల భూమికి ఖర్చు చాలా స్వల్పమని, పాలకులు నిధులు కేటాయించనందున వెనుకబడిన ప్రాంతంగా మిగిలిందని అన్నారు. దీనివల్ల కొన్ని ప్రాంతాలు కరువుకు గురవుతున్నాయన్నారు. లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీ మూతపడ్డాయన్నారు. వీటిని తెరిపించకుండా రియల్ ఎస్టేట్‌గా మార్చి వ్యాపారాలు చేసి జిల్లాలో పరిశ్రమలు లేకుండా చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో ఉత్పత్తులైన జీడి, చింతపండు తదితర పంటలతో మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించవచ్చన్నారు. జిల్లాలో ఒక్క ఇంజినీరింగ్ కాలేజీ కూడా లేదని, పేదలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పై చదువులు చదవలేని పరిస్థితి ఉందని, ఇది పాలకుల నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో స్పెషలైజేషన్ డాక్టర్లు లేరని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాలేదని, పేదలకు వైద్యం అందని ద్రాక్షగా ఉందన్నారు. గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు, రోడ్లు, వంతెనలు లేవన్నారు. పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడం ఈ జిల్లా పాలకులు నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. జిల్లా అభివద్ధి కావాలంటే అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు జిల్లా సమగ్ర అభివద్ధికి సాధన కమిటీగా ఏర్పాటై తోటపల్లి నిర్వాసిత పోరాట స్ఫూర్తితో పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రముఖ న్యాయవాది టి.జోగారావు మాట్లాడుతూ నీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి సెంటుకు నీరందించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, విద్య, వైద్యం అభివృద్ధికి అన్ని వర్గాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో న్యాయవ్యవస్థ అభివృద్ధికి కూడా సాధన కమిటీ ద్వారా కృషి చేయాలన్నారు. సమగ్ర అభివృద్ధిపై జరిగే ఉద్యమంలో భాగస్వాములవుతామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనకై జనవరి 10న ర్యాలీ, కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. సదస్సులో సిపిఎం నాయకులు మండంగి రమణ, కె.రామస్వామి, టి.రమేష్, భాస్కర్, కోలక అవినాష్, ఎన్‌వై నాయుడు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి శ్రీదేవి, వి.ఇందిర, జి.వెంకటరమణ, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, రెడ్డి లక్ష్మునాయుడు, దావాల రమణ, జగన్ నాయకులు, కె.సీతారాం, భాను, బలరాం, రెడ్డి ఈశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ప్రజలు

సదస్సులో తీర్మానాలు

జంఝావతి ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలి. గిరిజన ప్రాంతంలో చిన్న చిన్న గెడ్డలు, వాగులు, నదులపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలి. లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీలను తెరిపించాలి. గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించాలి. పార్వతీపురంలో యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ నిర్మించాలి. గిరిజన గ్రామాల్లో రోడ్లు, వంతెనలు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి, పూర్ణపాడు లాబేసు వంతెన పూర్తి చేయాలి. జిల్లాలో వ్యవసాయం,నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యా, వైద్యం, రోడ్లు వంతెనలు నిర్మాణ నిధులు విడుదల చేయాలి.

ప్రభుత్వం దిగి రావాల్సిందే..

ప్రజాశక్తి- కురుపాం

మేం అడిగేది గొంతెమ్మ కోరికలు కాదు... సిఎం జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయమని అడుగుతున్నాం.. ఇప్పటికైనా కళ్లు తెరవండి అంటూ కోరుతున్నారు అంగన్‌వాడీలు.. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం కురుపాం పెట్రోల్ బంక్ సమీపంలో కురుపాం , జియమ్మ వలస మండలాల్లోని వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. అందరూ సమ్మెబాట పట్టడంతో అంగన్వాడీ కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి. ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్నా అంగన్వాడీలు లెక్కచేయడం లేదు. నాలుగున్నర ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో సమ్మెబాట పట్టామని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని వీడబోమని చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే చాలు



అంగన్వాడీ కార్యకర్తలను, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే చాలు. అనంతరం ప్రభుత్వ సదుపాయాలన్నీ మాకు వస్తాయి. గౌరవ వేతనాలతో తమకు పని ఉండదు. వెట్టి చాకిరీ నుండి విముక్తి కలుగుతుంది. ప్రభుత్వం చెప్పిన విధంగా చేయడం తప్ప దాటవేసే దానికి సమయం లేదు. ఎల్లకాలం మమ్మల్ని మోసం చేయలేరు.

పి. సరళ కుమారి,
అంగనవాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు.

న్యాయం చేయాలని అడగడం తప్పా



సమస్యలు పరిష్కరించమని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం మా పై చర్యలు తీసుకుంటామని బెదిరించడం సరికాదు. బెదిరింపులకు భయపడే పరిస్థితి లేదు. న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలి. వేతనం పెంచడంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలి. శ్రమ దోపిడీని నియంత్రించాలి. రాజకీయ వేధింపులకు కట్టడి వేయాలి. ప్రభుత్వ ఉద్యోగులం కాకపోయినా తమకు ప్రభుత్వం నుంచి ఏ పథకం రావడం లేదు.

జె. సరోజ,
ప్రాజెక్ట్ కార్యదర్శి

హామీలన్నీ అమలు చేయాలి



అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆగదు. వేతనం కనీసం రూ.26 వేలు లేకుండా ఎలా బతకాలి. కుటుంబం పోషణ చాలా కష్టమవుతుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలి. కాదని నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం అవుతుంది.

డి. వెంకటరత్నం,
సెక్టార్ లీడర్.

బడ్జెట్ పెంచాలి



కేంద్రాల్లో వంట చేసేందుకు ఇచ్చిన పాత్రలు పాడయ్యాయి. కొత్త పాత్రలు ఇవ్వడం లేదు. భోజనం వండి పెడితే ఒక్కొక్కరికి రూపాయిన్నర ఇస్తున్నారు. గ్యాసు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. బడ్జెట్ దానికి చాలడం లేదు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా బడ్జెట్ కూడా పెంచాలి. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలి. టిఎ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలి.

కె. విజయ భవాని,
సెక్టార్ లీడర్.

తల్లి తర్వాత తల్లి అంగన్‌వాడీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తల్లి తర్వాత తల్లి లాంటివి అంగన్వాడీ కేంద్రాలనని 24, 25వ వార్డులకు చెందిన గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయా వార్డుల పరిధి నాయుడువీధిలో గల అంగన్వాడీ కేంద్రం వద్దకు వచ్చిన సభ్యులు మాట్లాడారు. పిల్లలను కనీపెంచడం తల్లి బాధ్యత అని, అటువంటి తల్లి కుటుంబ జీవన కోసం కూలి పనులకు వెళ్తూ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వద్ద విడిచి వెళ్తే, వారి మంచి, చెడు చూసుకొని వారికి తిండి పెట్టడంతో పాటు చిన్నారులు ఆహారం తినకపోయినా, బతిమిలాడి కథలు చెప్పి సొంత బిడ్డల్లా కంటికి రెప్పలా కాపాడుతున్నారని అన్నారు. వారి కడుపు నింపేది అంగన్వాడీలని, ఇలాంటి అంగన్వాడీలకు లబ్దిదారులు కుటుంబ సభ్యులు మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె విచ్ఛిన్నం చేయడం కోసం సచివాలయం, మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు సరైన పద్ధతి కాదన్నారు.



నాయుడువీధిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ఆరో రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి -కొమరాడ

అంగన్వాడీలు న్యాయమైన సమస్యలు పరిష్కరించ కుండా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె కొనసాగిస్తూ ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా సచివాల సిబ్బంది, వాలంటీర్లు, మహిళా పోలీసులు, ఎంపిడిఒ, వెలుగు సిబ్బందితో అంగన్వాడీ కేంద్రాల తాళాలు విరగొట్టి తెరిపించాలని చూడడం సిగ్గుచేటన్నారు. తాళం కొట్టి పిల్లల తీసుకెళ్లి ఫోటోలు తీసిన ఐదు నిమిషాలకే పిల్లలను తమ ఇంటికి పంపిస్తే మరి వారికి ఆహారం, రక్షణ, చదువు, పోషకాహారం ఎవరు చూస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన కోరికలు తీర్చి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గిరిజన సంఘం మండల నాయకులు రామారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

పాలకొండ : ఆరో రోజు అంగన్వాడీ సమ్మె సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, సమ్మెను విచ్ఛన్నం చేసే చర్యలు మానుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు గ్రామస్తులంతా మద్దతుగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని బుక్కురులో ఐద్వా ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం వద్ద లబ్ధిదారులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పాలకొండలో లబ్ధిదారులు, చిన్నారులతో కలిసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కవులు దేవానంద్, నిర్మల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఏజెన్సీ కవులకు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నేతృత్వంలో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో కన్వీనర్ కొల్లి రామావతి సారథ్యంలో ఈనెల 16,17 తేదీల్లో నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి జిల్లా శ్రీశ్రీ కళావేదిక అధ్యక్ష కార్యదర్శులు, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ కవులు పాలక దేవానంద్, పెద్దింటి నిర్మల్ కుమార్ హాజరయ్యారు. ఏజెన్సీ నుంచి తెలుగు సాహిత్యానికి వీరు చేస్తున్న కృషిని గుర్తించి సన్మానించారు.


దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

దిశా యాప్‌పై మహిళలకు విద్యార్థులకు ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లావణ్య దిశా యాక్ట్, యాప్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరిగే నేరాలపై అవగాహన, అత్యవసర పరిస్థితుల్లో స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలనే అంశాలపై విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ క్రాంతి కుమార్, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది లక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దిశా ఎస్ఐ లావణ్య



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా ఘంటసాల ఆరాధనోత్సవాలు

హాజరైన సంగీత దర్శకుడు మాధవపెద్ది


ప్రజాశక్తి - సాలూరు

ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో 12 గంటల పాటు ఘంటసాల నిర్విరామ నీరాజనోత్సవం నిర్వహించారు. ఏటా డిసెంబర్‌లో స్థానిక కబీర్‌షా ఆర్కెస్ట్రా ఆధ్వర్యాన ఘంటసాల ఆరాధనోత్సవాల కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గడచిన 25 ఏళ్లుగా పట్టణం ఇదే రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, ప్రముఖ వ్యాపారవేత్త మండవిల్లి వెంకటేశ్వరరావు, సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వర్ధమాన గాయకులు ఘంటసాల మధుర గీతాలను ఆలపించారు. మధుర గీతాలాపనలతో ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కబీర్ షా ఆర్కెస్ట్రా నిర్వాహకులు భాషా, ఉత్సవాల కమిటీ సభ్యులు రాంప్రసాద్ పాల్గొన్నారు.

నందివాడలో బాబు షూరిటీ... భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పనసనందివాడలో ఆదివారం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్ని వీధులు సందర్శించి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలోని టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయకష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టనున్నారని, మేనిఫెస్టో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, నియోజకవర్గ మండల యువత అధ్యక్షులు పి వెంకటరమణ, పొదిలాపు కష్ణమూర్తినాయుడు, మాజీ సర్పంచ్ కోరికన అసిరి నాయుడు, కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు.



త్రినాధ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

వైసిపి నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి సీనియర్ నాయకులు బి.త్రినాధరావును స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరామర్శించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గ్రామాభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతున్నామన్నారు. పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో మంచి నీరు, రహదారుల సమస్యకు ఇప్పటికే పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపిపి బంకురు రవి కుమార్, స్థానిక సర్పంచ్ ఇమరిక రాజు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, పకీరు నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు యాళ్ల ఈశ్వర ప్రతాప్, గండి శంకరరావు, జక్కు ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు గవర రమేష్, బి దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



లోకేష్‌కు సంఘీభావం తెలుపుతున్న ప్రగతి చైర్మన రవి

యువగళం పాదయాత్రలో రవి

ప్రజాశక్తి - సీతంపేట

అనకాపల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో నవశకం వైపు అడుగులు వేస్తూ.. ఆయన్ను మన్యం ప్రగతి చైర్మన్ గేదెల రవి మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. పాలకొండ నియోజవర్గంలో సమస్యలు రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు. సవర మాలయ్య, మాజీ ఎంపిపి బిడ్డిక దమయంతి నాయుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి, పాలకొండ నియోజకవర్గం మహిళ అధ్యక్షులు మరియు టీం సభ్యులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపు పట్ల ధన్యవాదాలు

ప్రజాశక్తి -భామిని

వంశధార ప్రాజెక్ట్ కోసం భూములిచ్చిన రైతులకు నామమాత్రపు పరిహారంతో గత ప్రభుత్వం సరిపెట్టింది. ఈ అంశంపై గతంలో సిఎం జగన్ ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా వంశధార నిర్వాసితులు జగన్‌కు తమ సమస్యను తెలిపారు. తాను అధికారంలోకి రాగానే ఎకరాకు లక్ష రూపాయిలు చొప్పున చెల్లిస్తామని జగన్ మోహన్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఈ హామీ ప్రకారం వైసిపి ప్రభుత్వం రాగానే వంశధార నిర్వాసితులకు ఎకరాకు లక్ష రూపాయిలు చొప్పున అదనపు పరిహారం అందజేశారు. భామిని మండలంలోని కొంతమంది రైతులకు సాంకేతిక కారణాలతో ఈ అదనపు పరిహారం అందలేదు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే వి.కళావతి దృష్టికి స్థానిక ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం ద్వారా వివరించారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో సాంకేతిక కారణాలతో నిలిచిన తమ అదనపు పరిహారం తమ ఖాతాల్లో జమవ్వడంతో మండలంలోని కాట్రగాఢ -బి, నేరడి, లివిరి, బిల్లుమడ, నులకజోడు, భామిని, బాలేరు గ్రామాలకు చెందిన రైతులు ఎంఎల్ఎకు, ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని చిన్నబొండపల్లి, అడ్డాపుసిల గ్రామ పరిసర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన పిక్నిక్ ల వద్ద పేకాట ఆడుతున్న వారిని రూరల్ ఎస్ఐ దినకర్ అధ్వర్యంలో పోలీసులు దాడుల నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో రూ.1,32,000 నగదు స్వాధీనం చేసుకున్నారు .పేకాట ఆడుతున్న 29 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పలుచోట్ల వికసిత్ భారత్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో సీతంపేట, పాలకొండ, కొమరాడ మండలాల్లో ఆదివారం వికసిత్ భారత్ కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితోపాటు పాల్గొన్నారు.

పర్యాటక ప్రేమికులకు అడ్వెంచర్ అనుభూతి

ప్రజాశక్తి - సీతంపేట

కార్తీక మాసం ప్రారంభమైందంటే చాలు టక్కున గుర్తొచ్చేది సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్. ఈ పార్క్‌లోని సాహసభరితమైన విన్యాసాలు, క్రీడలతో పాటు మన్యం అందాలను పర్యాటక ప్రేమికులు సొంతం చేసుకోవచ్చు. చిన్నారుల నుండి పెద్దలు, వృద్దులు సైతం వెళ్లొచ్చు. అప్పటి వరకు బిజీబిజీగా ఉన్న ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఫ్యామిలీతో వచ్చి పార్కులోని అందాలను ఆశ్వాదించి కాసేపు సేద తీర్చుకుంటారు. ఇక కార్తీక మాసం, పండగలు అందులో ఆదివారం వచ్చిందంటే చాలు స్నేహితులు, బంధువులతో పర్యాటకంతో అడ్వెంచర్ పార్కు పోటెత్తుతుంది. సీతంపేట విహారయాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పవటం లేదు. పార్కులో ఎక్కడా లేనివిధంగా ఫైవ్ డి థియేటర్లో భయభ్రాంతులకు గురిచేసే హర్రర్ పిక్చర్లు పర్యాటకులు వీక్షిస్తారు. అబ్బుర పరిచే క్లైమ్బిక్ వాల్, స్వలైడింగ్ వాల్, సాహసోపేతమైన క్రీడలు, జలవిహార్‌లో బోటు షికారు చేస్తుంటే మరో పక్క రోడ్డు పక్కనే వాహనాలు రైయ్ రైయ్ రయ్యమంటూ పరుగులు తీస్తుంటాయి. జలవిహార్ మధ్యలో హ్యాంగింగ్ బ్రిడ్జిపై నీటి మీద నడక యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొడుతుంటే ఆ అనుభూతి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఇక చిన్నారులు మినీ ట్రైన్ కమెండో నెట్ ఎక్కి చిన్నారులు ఆడుతున్నారు. ఆనంద్ విహార్ వద్ద డాన్సులు వేసి ఉత్సాహంగా, ఉల్లాసంగా డాన్సులు వేస్తారు. గిరి విహార్ వాహనంలో మన్యం అందాలు, ఆడాలి యూ పాయింట్ పోల్ల య్యాపాయింట్ జగత్ పల్లి రిసార్ట్స్, సున్నపుగెడ్డ, మెట్టుగూడ జలపాతాలు ప్రకృతి ఒడిలో దాచుకున్న మైమరిపించే అందాలను పర్యాటకులు తన సొంతం చేసుకుంటారు. ఒకవైపు పచ్చని పొలాలు మరోవైపు ఓంపు సొంపులతో సొగసు లు చూపిస్తున్న కొండలు పక్కనే జలజలా ప్రవహించే జలపాతాలు, మన కన్నా ముందుకు దూసుకుపోతున్న నీలిమేఘాలు, కొండలపై నుంచి ప్రయాణించేటప్పుడు పచ్చని పొలాల నుండి పైరు గాలి మన శరీరానికి తాగుతుంటే మనసు ఏటో వెళ్లిపోతుంది.



మినీ ట్రైన్‌పై సందడి చేస్తున్న చిన్నారులు

ఏజెన్సీలో పర్యాటక శోభ

గుమ్మలక్ష్మీపురం : అందం, ఆహ్లాదం, ప్రకృతి సౌందర్యం గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ సొంతం. అందమైన ప్రకృతి సోయగాలు... జాలువారే జలపాతాలు చూసేందుకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు చర్యలు చేపడుతున్నారు. సవరకోటపాడు ఉద్యానవన నర్సరీ శిక్షణ కేంద్రం పర్యాటక ప్రాంతం వైపు అడుగులు వేస్తోంది. 38 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నర్సరీలో సిమెంటు రోడ్డు, ఆర్చీ గోడ, యోగా ప్రతిమలు, పద్మవ్యూహం, అల్లూరి విగ్రహం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఇవి పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. బోటు షికారు, చిన్నపిల్లల పార్క్, పూల తోటల పెంపకం వంటి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తాడికొండ మొగనాలి గెడ్డ జలపాతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందింది. జాలువారే జలపాతం చూసేందుకు శ్రీకాకుళం, పార్వతీపురం, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో వనభోజనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. పర్యాటకుల కోసం అన్ని రకాల వసతులు, సౌకర్యాలు అందుబాటు తీసుకొస్తున్నారు.



మెట్టగూడ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 20న భోగాపురం మండలం పోలిపల్లి వద్ద యువగళం ముగింపు సభకు నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు ప్రతి మండలంలోని మండల పార్టీ కన్వీనర్‌తో సమన్వయం చేసుకొని మండలాల నాయకులు , కార్యకర్తలు భారీగా వాహనాల్లో బయలుదేరి భారీ బహిరంగ సభను మన బాధ్యతగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బలిజిపేట : యువగళం - నవశకం ముగింపు సభను విజయవంతం చేయాలని పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. బలిజిపేటలో మండల స్థాయి టిడిపి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుండి అత్యధిక సంఖ్యలో జనం హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, క్లస్టర్ ఇంఛార్జి రాంబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : ఈనెల 20న భోగాపురం వద్ద లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమం ముగింపు సభ పెద్ద ఎత్తున తెలుగుదేశం అభిమానులు తరలిరావాలని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి పంచాయతీ నుండి టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు



భామిని : సమావేశంలో మాట్లాడుతున్న జయకృష్ణ

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 20న విజయనగరం జిల్లా పోలిపల్లి వద్ద టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర ముగింపు సభకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడు చర్చించినట్లు కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. కురుపాం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులను సభకు తీసుకువచ్చేలా మండల కన్వీనర్లు కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్, కురుపాం నియోజకవర్గ యువగళం పరిశీలకులు ఆనంద్ సాగర్ పాల్గొన్నట్లు తెలిపారు.

18న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 18న పార్వతీపురంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం, నిరుద్యోగ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్, ఆరిక ప్రభాకరావు తెలిపారు. గిరిజన విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి, ఐటిడిఎ మనుగడ లాంటి అనేక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పార్వతీపురం ఐటిడిఎకు రెగ్యులర్ డిడి, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారిని నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించలేదని అన్నారు. అనేక గిరిజన గ్రామాలకు గిరిజనులే రోడ్డు మార్గాలు వేసుకుంటున్నారని తెలిపారు. ఐటిడిఎ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఎ పాలక వర్గ సమావేశాలు లేవని అన్నారు. గిరిజన వ్యవసాయ, ఉద్యానవన శాఖలు పూర్తిగా పనిలో లేవని, నిరుద్యోగ యువతకు రుణాలు, ఉపాధి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై భవిష్యత్తులో పోరాటం చేస్తామని, అందుకు కలిసి వచ్చే వారితో ఈనెల 18న పార్వతీపురంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుపుతున్నామని అన్నారు.



పింఛనుదారుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

భారీ వాహనాలతో భయం భయం...

రోడ్డెక్కితే అంతే • స్పీడ్ బ్రేకర్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి


మండలంలో వరస రోడ్డు ప్రమాదాలతో వాహనదారులు హడలిపోతున్నారు. రక్తపు గతంలో ఎన్నడు ఇంతటి భయంకరమైన, దారుణమైన ప్రమాదాలు ఈ మండలంలో జరిగి ఉండలేదని వాహదారులు వాపోతున్నారు. పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్లే రహదారి పారాది వద్ద మరమ్మతులకు గురికావడంతో భారీ వాహనాలు పాలకొండ నుంచి పార్వతీపురం వైపు మళ్లించడంతో వాహనదారులు ఈ భారీ వాహనాలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. బతుకు తెరువు కోసం ఆటోలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వాహనదారులు భారీ వాహనాల స్పీడ్‌ను చూసి గుండెలు అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడపాల్సి వస్తుంది. గుంతలమైయమైన రహదారుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. భారీ వాహనాలు వచ్చేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు గమనించకుండా వాహనాలను అధిగమించేందుకు వేగంతో వెళ్లి ప్రమాదాలు జరిగేందుకు కారకులౌతున్నారని వాహనదారులు భయపడుతున్నారు. ప్రమాదాలు నివారించేందుకు పోలీసు యంత్రాంగం రాత్రి వేళ పెట్రోలింగ్ వెహికల్స్ ఏర్పాటు చేయాలని వాహదారులు కోరుతున్నారు.

రోడ్డు ఎక్కితే భయం...

రోడ్డుపైకి వచ్చిన తర్వాత మరలా ఇంటికి క్షేమంగా వెళ్తామో లేదోనని భయంతో బిక్కు బిక్కుమంటూ రోడ్డుపైన ప్రయాణించాల్సి వస్తుందని, ఈ గుంతలమైన రోడ్లో ఏ భారీ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో తెలియక భయంతో ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఈ సంఘటనలను నిర్మూలించడానికి రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల వద్ద స్పీడ్ బ్రేకర్లు గానీ, బారికేడ్లు గానీ ఏర్పాటు చేసినట్లయితే వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని వాహనదారులు కోరుకుంటున్నారు.

అనాధలైన కుటుంబాలు...

గడచిన మూడు నెలల్లో మండలానికి సంబంధించి గొట్టివలసకు చెందిన బోను రవికుమార్ నాగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. రావివలసకు చెందిన యాల కిరణ్ (34), అక్కడికక్కడే మృతి చెందగా, గంట నరేష్ గాయాల పాలయ్యాడు. అలాగే ఉల్లిభద్రకు చెందిన పొడుగు గణపతి (63) కిరాణా వ్యాపారం చేసుకుంటా కుటుంబాన్ని నడిపేవాడు. గతనెల 30 ఉల్లిభద్ర నుంచి రోజువారీ పనుల్లో భాగంగా పార్వతీపురం వెళ్తుండగా అడ్డాపుశీల వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి గుద్దడమే కాకుండా ఆ వ్యక్తిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా ఒక్కరా, ఇద్దరా అనేక మంది వ్యక్తులు రోడ్డు ప్రమాదం వల్ల ద్విచక్ర వాహనదారులు మరణించడం, అలాగే అంగవైకల్యం జరిగి వారి కుటుంబ సభ్యులు అనాధలుగా మారారు.



పాలకొండ రోడ్డుపై వెళ్తున్న భారీ వాహనాలు

బారికేడ్లు ఏర్పాటుకు ప్రయత్నం...

మండలంలో జరుగుతున్న వరుస ప్రమాదాలను అరికట్టేందుకు ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాం. వాహనదారులు మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి. ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించి ఓవర్ టాక్ చేయాలి.

అజీజ్, ట్రైనీ డిఎస్‌పి

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

జిల్లాలోని అన్ని రహదారులు మరమ్మతులకు గురయ్యాయి. ప్రతి ఏటా చేయాల్సిన నిర్వహణ పనులు చేయకపోవడంతో రోడ్ల చిద్రమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం పూనుకోవాలి. రోడ్లకు ఇరువైపులా మొక్కలను తొలగించాలి. రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు కృషి చేయాలి. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయాలి. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టాలి.

బివి రమణ,
సిపిఎం మండల కార్యదర్శి.

పెన్షనర్లకు అన్ని విధాలా సహకరిస్తాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ బ్యాంకు పరంగా పెన్షనర్లకు ఎటువంటి సమస్యలున్నా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌బిఐ మేనేజర్ బిఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక వర్తక సంఘం భవనంలో నిర్వహించిన పెన్షన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సమావేశానికి గుమ్మలక్ష్మీపురం పెన్షన్ల సంఘం అధ్యక్షులు గుడ్ల హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. పెన్షనర్లకు ఎటువంటి సమస్యలున్నా తనకు స్వయంగా వచ్చి కలిసి చర్చించవచ్చుని, తక్షణ చర్యలు తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అలాగే పింఛనర్లు ఎవరికైనా వ్యక్తిగతంగా రుణాలు కావాల్సినా తమను సంప్రదించ వచ్చుని వెల్లడించారు. అలాగే పెన్షనర్లు ఎప్పటికప్పుడు సమావేశం ఏర్పాటు చేసుకొని వారి సమస్యల్ని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్స్ కు సహకరించేందుకు తాము ఏప్పుడు సిద్ధంగా ఉంటామని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నామన్నారు. ఎస్బిఐ ఆధ్వర్యంలో గల వివిధ పథకాలను గురించి ఎస్బిఐ అధికారి నవీన్ సభలో వివరించారు. ఇందులో ముఖ్యంగా పెన్షనర్లకు మూడు పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ జనవరిలో ప్రతి పెన్షనర్ లైఫ్ సర్టిఫికెట్ చేయించుకోవాలన్నారు. కురుపాం ట్రెజరీ అధికారులు ఎంతగానో సహకరిస్తారని దాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే హెల్త్ కార్డు లేని వారు యూనియన్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు చలపతిరావు, బి.తిరుపతిరావు, చిన్నారావు, ఢిల్లీ మాస్టారు, మహిళలు పాల్గొన్నారు.

రిటైర్డ్ పెన్షన్ దారులకు సన్మానం

పార్వతీపురంటౌన్ : అఖిలభారత పెన్షన్‌దారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆదివారం పట్టణంలో రైతు బజార్ వెనుక ఉన్న రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ దారుల భవనంలో 75 ఏళ్లు నిండిన పెన్షదారులను డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాస్టారు అధ్యక్షతన కార్యవర్గ సభ్యులచే దుస్సాలువాలతో సత్కరించారు. సమావేశానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా గాంధీ విగ్రహానికి, కీర్తి శేషులు నకరా విగ్రహానికి సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సంఘ కార్యదర్శి డి.గణపతిరావు నివేదికను చదివి వినిపించారు. ప్రముఖ కవి గంటేడ గౌరి నాయుడు మాస్టారు రచించిన గీతాన్ని జి.సోమేశ్వరరావు, బి.ప్రకాష్ ఆలపించారు. అనంతరం సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

అభివృద్ధికి ఆమడ దూరాన మూలజమ్ము

పక్కా గృహాలు కరువు
రక్షణ గోడ లేక గ్రామంలోకి వరదనీరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం కానరావడం లేదు. నేటికీ అనేక గిరిజన గ్రామాలు సమస్యల్లో కూరుకుపోయి అభివృద్ధికి ఆమడ దూరంగానే ఉన్నాయి. దీంతో అక్కడి గిరిజన జీవనం వెనుకబాటుతనాన్ని సూచిస్తుంది. మండలంలోని లుంబేసు పంచాయతీ మూలజమ్ము గ్రామ గిరిజనులు సమస్యలతోనే సహజీవనం చేస్తున్నారు. గ్రామం ఏర్పడి 50 ఏళ్ళ గడిచిన ప్రధాన రహదారి మెరుగుపడలేదు. రాళ్లు తేలడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామంలో 70 కుటుంబాలు ఉండగా 300 మంది జనాభా కలిగి ఉన్నారు. గ్రామంలో ఐదుగురికి మాత్రమే పక్క గృహాలు మంజూరయ్యాయి. మిగిలిన వారంతా సొంత డబ్బులతో రేకిళ్లు నిర్మించుకున్నారు. చెక్ డ్యాములు పూర్తిగా శిథిలమవ్వడంతో పంట పొలాలకు సాగునీరందని పరిస్థితి. కొండవాగు చలము నీరు గ్రావిటీ సిస్టం ద్వారా గ్రామానికి తెచ్చుకొని వినియోగిస్తున్నారు. వర్షం పడితే బురదని వస్తుందని తెలిపారు. వీధి కాలువలు నిర్మాణం లేకపోవడంతో వాడిక నీరు నిల్వ ఉండిపోవడంతో రోగాల బారిన పడుతున్నామని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో వర్షం పడిందంటే కొండపై నుంచి నీరు గ్రామంలోకి వస్తుందంటున్నారు. ఇదిలా ఉండగా చదువుకున్న యువత ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలిపోయారని గ్రామస్తులు పువ్వల మోహన్‌రావు, సన్యాసిరావు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.



రేకిళ్లతో దర్శనమిస్తున్న మూలజమ్ము

అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మండలంలోని రెండో విడత కింద 29 పాఠశాలలకు గానూ రూ.9 కోట్ల 43 లక్షల పైచిలుకతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు చెల్లింపుల్లేక గుత్తేదారులు పనులు అర్ధాంతరంగానిలిపివేశారు. మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.88 లక్షలతో మూడు అదనపు భవనాలు నిర్మించేందుకు గత ఏడాది పనులు ప్రారంభించారు. అయితే ఈ మూడు భవనాలు పునాదులకే పరిమితి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు భవన నిర్మాణాలు కూడా అరకొరగానే పనులు ప్రారంభించి నిలిపివేశారు. 29 పాఠశాలల్లో కోమటివీధి, రెగ్యులర్ పాఠశాలల తప్ప ఎక్కడా భవనాల పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు వచ్చే దాఖలాలు కనిపించ లేదు. భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆయా పాఠశాల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ఏడాది మే 6న సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించినప్పుడు పాఠశాల పనులు వేగవంతం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల పున: ప్రారంభానికి పనులు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ దాదాపుగా ఏడు నెలలు కావస్తున్నా పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



కంబరవలసలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు